క్లుప్తంగా

మావుళ్లమ్మ సేవలో కలెక్టర్



మావుళ్లమ్మ సన్నిధిలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం భీమవరం మావుళ్లమ్మను దర్శించుకున్నారు. ముందుగా విఘ్నేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ జిల్లా కలెక్టర్ గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

ప్రాథమిక స్థాయి నుంచే హిందీ నేర్చుకోవాలి



విద్యార్థులకు హిందీపఠనం నేర్పుతున్న హెచ్ఎం ఆర్వీ నారాయణ

ఆకివీడు: మాతృభాషతో పాటే హిందీ, ఇంగ్లిష్ భాషల్ని ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు నేర్పాలని హెచ్ఎం ఆర్వీ నారాయణ(విక్రమ్) చెప్పారు. మండలంలోని అజ్జమూరు గురువులోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం హిందీ భాషోత్సవం సందర్భంగా విద్యార్థులతో హిందీ పఠనం, రాయడం, సంభాషణ, నాటకం, యాక్షన్ పద్యాలు, వ్యాకరణం, వర్ణమాల, గుణింతాలు చెప్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నాగ కళ్యాణి, విద్యాకమిటీ సభ్యులు ధనలక్ష్మి, శివ, ఏసుకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

తపాలా బీమా చెక్కు పంపిణీ



తపాలా బీమా చెక్కు పంపిణీ చేస్తున్న దృశ్యం

వీరవాసరం: ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అందుకు పోస్టల్ శాఖ అందిస్తున్న పిఎల్ఐ – ఆర్‌పిఎల్ఐ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం తపాలా శాఖా సీనియర్ సూపరింటెండెంట్ కే. హరికృష్ణ ప్రసాద్ తెలిపారు. వీరవాసరం మండలంలో ప్రత్యేక క్యాంపు నిర్వహించి గ్రామస్తులకు పోస్టల్ పథకాలపై అవగాహన కల్పించారు. ఇటీవల ఆకస్మికంగా మరణించిన తపాలా బీమాదారుడు పెంటకోటి రాంబాబు కుటుంబానికి రూ.5,43,439 చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డీవైఈవో రమేష్‌కు అపుస్మా అభినందనలు



డీవైఈవో రమేష్‌ను అభినందలు తెలుపుతున్న అపుస్మా నాయకులు

భీమవరం: భీమవరం డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీవైఈవో)గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన రమేష్‌కు అపుస్మా ఆధ్వర్యంలో శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం డీవైఈవో కార్యాలయంలో రమేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షుడు అక్కినేని కృష్ణకిషోర్, భీమవరం జోన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, వి వంశీ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ నర్సింహరాజు, మురళి తదితరులున్నారు.

కరాటే పోటీల్లో బీవీబీ విద్యార్థులకు బంగారు పతకాలు



కరాటేపోటీల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: నిడదవోలు పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో భీమవరం భారతీయ విద్యాభవన్(బీవీబీ) స్కూల్ విద్యార్థులకు బంగారు పతకాలు సాధించారని ప్రిన్సిపల్ దేవీపద్మ చెప్పారు. బుధవారం పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛతకు తూట్లు

- ప్రమాదం అంచున ప్రజారోగ్యం
- రహదారులే డంపింగ్ యార్డులు
- విజృంభిస్తున్న దోమలు..
- ప్రబలుతున్న వ్యాధులు
- మచ్చుకైనా కానరాని 'స్వచ్ఛభారత్'
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



బ్రౌనింగ్ కళాశాల సమీపంలో ఉన్న చెత్త చెదారం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణం..పల్లెలకు వచ్చే వారికి చెత్త స్వాగతం పలుకుతోంది. రోడ్ల పక్కన నిలుచునే పరిస్థితి లేని తీరు కలవరపెడుతోంది. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పట్టించుకోకపోవడంతో దయనీయ స్థితి నెలకొంది. ప్రధాన రహదారులు అంచులనే మున్సిపాల్టీలు డంపింగ్ యార్డులుగా మార్చేస్తున్నాయి. నియోజకవర్గంలో పట్టణంతో పాటు గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న చెత్త గుట్టలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయి అడవులను తలపిస్తున్నాయి. రోడ్ల మార్జిన్‌లోనే రాజకీయ పార్టీల నాయకులు, వ్యాపార ప్రకటనకు సంబంధించిన భారీ కటౌట్లు, బ్యానర్లు పెడుతున్నారు. దీంతో నియోజకవర్గంలో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

పట్టణ వాసులకు తప్పని కష్టాలు

పట్టణంలో పలు రహదారుల పక్కన డ్రెయిన్లలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నిలిచి దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు హోటళ్లలో వ్యర్థాలను నేరుగా డ్రెయిన్లలోకి వదిలేస్తున్నారు. ఇలాంటి వ్యర్థాలను తొలగించేందుకు కార్మికులు కూడా వెనకాడుతున్నారు.

దోమలు బాబోయ్..దోమలు

ఏ నోట విన్నా దోమలు బాబోయ్ అనే మాట తప్ప మరే మాట వినిపించని దుస్థితి నేడు నెలకొంది. ఓవక్క చలి తగ్గి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా దోమల ఉధృతి మరింత పెరుగుతుండడం ప్రజానీకాన్ని కలవరపెడుతోంది. ఇళ్లలో సైతం నిల్చోనివ్వవు.. కూర్చోనివ్వవు.. పడుకోనివ్వవంటూ ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు. ఇక ఆరుబయట ఉంటే శరీరంపై తేనెపట్టులా పట్టేసి జలగల్లా రక్తం పీల్చేస్తున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా దోమకాటుతో ఏ రకాల జబ్బులు వస్తాయోనని ప్రజానీకం బెంబేలెత్తిపోతున్నారు. సాయంత్రం 5 గంటలైతే చాలు ఎక్కడలేని దోమలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయని ఏ మందులు వాడినా పోవడంలేదని వాపోతున్నారు.

స్వచ్ఛ సంకల్పానికి తిలోదకాలు

స్వచ్ఛభారత్ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పుడు కొత్తగా స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ పేరుతో చేపట్టే పారిశుద్ధ్య, కార్యక్రమాలు సైతం ఎక్కడా జరగడం లేదు. చెత్త రహిత వార్డులు, గ్రామాలుగా తీర్చిదిద్దాలనే సంకల్పానికి అధికారులు తిలోదకాలిస్తున్నారు. నిర్వహణ కొరవడి పట్టణం, గ్రామాల్లో రోడ్ల వెంబడి చెత్త పేరుకుపోతుంది. ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ప్రజలు దుర్వాసనతో సావాసం చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పట్టణంలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే పారుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో పట్టణంలోని పలు వీధులు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగింపుపై అధికారులు ఏమాత్రం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా చెత్త గుట్టలు గుట్టలుగా పేరుకుపోవడంతో దోమలు, ఈగలు లార్వాల సంతతికి నెలవుగా మారింది. దీంతో స్థానికులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు.



బొక్కావారిపాలెం నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్త



మెంటేవారి తోట బైపాస్ సమీపంలో ఉన్న చెత్త వ్యర్థాలు



ఆర్టీసీ డిపో ముందు ఖాళీ స్థలంలో ఉన్న చెత్తాచెదారం

డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న మురుగు



ఆర్టీసీ డిపో వెనుక అధ్వానంగా ఉన్న డ్రెయిన్

భీమవరం(ప్రకాశం చౌక్): డ్రెయినేజీల్ల మురుగు సమస్యతోపాటు దోమల లార్వా కూడా అక్కడక్కడా దర్శనమిస్తుంది. ముఖ్యంగా డ్రెయినేజీల్లో మురుగునీరు ప్రవాహానికి చెత్త, వ్యర్థాలు తీవ్ర ఆటంకాన్ని సృష్టించడంతో సమస్య తీవ్రతరం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. మురుగునీరు ప్రవాహం సక్రమంగా లేని డ్రెయినేజీల్లో లారా తీవ్ర స్థాయిలో తిష్టవేస్తుందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమవరం మున్సిపాల్టీ పరిధిలోని 39 వార్డుల్లోను ఇదే సమస్య పొంచి ఉందని దోమకాటు నుంచి పిల్లలను కాపాడుకోలేక ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు చెప్పిన విధంగా ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నా ఈ దుస్థితిలో మార్పు రావడం లేదని చెబుతున్నారు.

విద్యార్థులు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

భీమవరం: విద్యార్థులు జీవితంలో చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ఆటల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయని భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల ప్రిన్సిపల్ మెంటే హరనాథ్‌బాబు అన్నారు. సౌత్‌జోన్ క్రికెట్ టీమ్ సెలక్షన్స్‌లో నన్నయ్య ఇంటర్ యూనివర్సిటీ టీమ్ తరుపున ఎంపికైన కేజీఆర్ఎల్ కళాశాల విద్యార్థులు బెంగుళూరులో జరిగిన యూనివర్సిటీ క్రికెట్ పోటీల్లో జి చరణ్ సాయితేజ, హాకీ పోటీల్లో కె పార్థసాయి, ఎం ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. క్రీడాకారులకు బుధవారం క్రీడాసామగ్రి అందజేసిన హరనాథ్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు తోట రామ్మూర్తి, ఇంటి రామచంద్రమూర్తి, సీహెచ్ వినోదరావు, ఎంవిబి గంగాధరరావు, షేక్ రహీమ్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం కేజీఆర్ఎల్ కళాశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఆకివీడు: అంగన్‌వాడీ చిన్నారులకు విజ్ఞానదాయకమైన మాటలు చెబుతూ, ఆట పాటలతో వారి మేధస్సుకు పదును పెట్టాలని మండల విద్యాశాఖ అధికారి ఎ.రవీంద్ర పిలుపునిచ్చారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రెండో రోజు జ్ఞాన బోధ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రవీంద్ర మాట్లాడుతూ పసిప్రాయంలోనే పౌష్టికాహారం పొందుతూ మేధస్సు, శారీరక దారుఢ్యం పెంపొందించే విధంగా అంగన్‌వాడీ వర్కర్లు కృషి చేయాలన్నారు. కేంద్రాల అనుసంధానంతో చిన్నారుల్లో మరింత క్షేత్రస్థాయి పరిజ్ఞానం వృద్ధి చెందుతుందన్నారు. సెకండరీ విద్యలో అభ్యాసనానికి సంబంధించిన నాణ్యతను మెరుగుపరచడంపై కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు ముకుందరావు, రత్నకుమారి, నాగలక్ష్మి, రాంబాబు, ఇస్మాయిల్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ ఎ.రవీంద్ర

రామ్మూర్తికి సత్కారం

కాళ్ల: సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (జెడ్ఆర్‌యూసీసీ) సభ్యుడిగా ఎంపికైన కోరా రామ్మూర్తిని బీజేపీ శ్రేణులు సత్కరించాయి. మండలంలోని పెదఅమిరంలో బుధవారం బీజేపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్మూర్తి మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతి కార్యకర్తకూ, నాయకుడుకూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. అనంతరం బీజేపీ కాళ్ల మండల కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పానకాల కృష్ణాంజనేయరావు, సుంకర కాశీ విశ్వేశ్వరరావు, గాదిరాజు వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

కొణితివాడలో శివాజీ జయంతి వేడుకలు

వీరవాసరం: 17 ఏళ్ల వయసులో శివాజీ మొట్టమొదటి యుద్ధం చేసి బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ యరకరాజు సత్యహరి హరరాజు (హరిబాబు) అన్నారు . కొణితివాడలో ధర్మ రక్షకుల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ జయంతి వేడుక బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ శివాజీ ధైర్యసాహసాలను కొనియాడారు. శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఇమ్మాళరాజు నరసింహారాజు, ముదునూరి ప్రసాద్‌రాజు, తమలాకుల గోవర్ధనాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



కొణితివాడలో ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడ్డ సంచుల పంపిణీ



లెప్రసీ కాలనీలో గుడ్డ సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): మున్సిపల్ అర్బన్ హెల్త్ సెంటర్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు 7వ వార్డు కుష్టు వ్యాధిగ్రస్తుల కాలనీలోని ఉచితంగా గుడ్డ సంచులను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. కుష్టు వ్యాధి కాలనీ అధ్యక్షుడు కె వీర్రాజు మాట్లాడుతూ మా కాలనీలో ఈ క్షణం నుంచే ప్లాస్టిక్ వస్తువులను విస్మరించి ప్లాస్టిక్ రహిత కాలనీగా చేస్తామని, మన ఆరోగ్యాల కోసం అధికారులు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను చేపట్టడం గొప్ప విశేషమని అన్నారు. సభ్యులు నరసింహమూర్తి, జార్జి, శేషయ్య ప్లాస్టిక్ నిషేధంపై మాట్లాడారు. చెరుకువాడ రంగసాయి ప్లాస్టిక్ నిషేధ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సర్ సివి రామన్ స్కూల్ సెక్రటరీ రావనం వేణుగోపాలరావు, 7వ వార్డు మున్సిపల్ సెక్రటరీ కే సందీప్, నాగేశ్వర్రావు, సోమేశ్వరరావు, సతీష్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు సామూహిక ఎలుకల నిర్మూలన

ఉండి: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. గురువారం ప్రతి రైతూ తమ పొలంలోని ఎలుకల బొరియలను గుర్తించి వాటిని మట్టితో పూడ్చివేయాలని అన్నారు. ఇలా పూడ్చివేయడం ద్వారా బొరియల్లో ఎలుకలు ఉంటే వాటిని తిరిగి తెరుస్తాయని పేర్కొన్నారు. ఆ తెరిచిన బొరియల్లో శుక్రవారం రైతు సేవాల కేంద్రాల వద్ద ప్రభుత్వం అందించే బ్రోమోడయోలిన్ మందును చిన్న చిన్న పొట్లాలుగా కట్టి వేయాలని, అలాగే మళ్లీ ఆ బొరియలను మట్టితో పూడ్చివేయాలని వివరించారు. అలాగే కేవలం పొలంలోనే కాకుండా పొలంగట్లపైనా, రోడ్ల పక్కన, కాలువగట్లపైనా, బంజరు భూముల్లోనూ ఇలా చేయాలని కోరారు. రైతులంతా సామూహికంగానే ఈ పని చేస్తేనే సమస్య పరిష్కారం అవుతుందని వివరించారు.

వేణుగోపాల్‌ను గెలిపించండి

భీమవరం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కట్ట వేణుగోపాల్‌కు వివిధ ప్రజాసంఘాలు మద్దతు ప్రకటించాయి. బుధవారం భీమవరం పట్టణంలోని సర్దార్ గౌతులచ్చన్న కమ్యూనిటీ హాల్లో బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగి సమావేశంలో ఈ మేరకు సంఘీభావం ప్రకటించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయగల వేణుగోపాల్‌కు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ అంగదాల పూర్ణచంద్రరావు, కన్వీనర్ బీసీ రమణ, బహుజన కులాల నాయకుడు చింతపల్లి గురుప్రసాద్, బహుజన విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు జెవి కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, భాస్కరరావు, పాల మహేందర్, అరటికట్ల త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి వేణుగోపాల్‌కు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

బైపాస్ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం

భీమవరం: భీమవరం పట్టణ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణం కల సాకారం కానుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. బుధవారం భీమవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)తో కలసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పామర్రు నుంచి దిగమర్రు వరకు 165 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రెండో ప్యాకేజీ ఆకివీడు బైపాస్ నుంచి దిగమర్రు వరకు 40 కిలోమీటర్ల కొత్త మార్గంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైందన్నారు. సుమారు 25 ఏళ్లుగా భీమవరం బైపాస్ రోడ్డు సమస్య కోర్టు కేసులు, పలు వివాదాలతో నత్త నడకన సాగుతోందని దీనితో గత ఆరు నెలలుగా బైపాస్ రోడ్డు సమస్య పరిష్కారానికి చేసిన కృషి ఫలించిందన్నారు. బైపాస్ రోడ్డు ఆకివీడు బైపాస్ నుంచి అజ్జమూరు, చెరుకువాడ, చినపుల్లేరు, పెదపుల్లేరు, సీసలి, కోనాలపల్లి, కోపల్లె, పెద అమిరం, చినఅమిరం, రాయలం, భీమవరం పట్టణంలోని గుడిపూడి, తాడేరు, గొరగనమూడి, పెన్నాడ అగ్రహారం, శృంగవృక్షం, వీరవాసరం బ్రిడ్జ్ వరకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమైనట్లు శ్రీనివాసవర్మ చెప్పారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాక వెంకట సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, కోళ్ల నాగేశ్వరరావు, పేరిచర్ల సుభాష్, కలిదిండి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షయను నిర్లక్ష్యం చేయొద్దు



క్షయ వ్యాధి లక్షణాలను వివరిస్తున్న డాక్టర్ గోవిందబాబు

భీమవరం(ప్రకాశం చౌక్): రెండు వారాలకు మించి దగ్గు, ఆకలి మందగించడం, జ్వరం వస్తుండటం క్షయ వ్యాధి లక్షణాలని వీటిని నిర్లక్ష్యం చేయొద్దని డా.గోవిందబాబు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, చికిత్స విధానం, వ్యాధికారిక క్రిమి వ్యాప్తి బరువు తగ్గడం, చాతి నొప్పి తదితర లక్షణాలుంటే వెంటనే ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు వి.మాధవి, ఎన్.రంగారావు, ప్రవీణ్, పద్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీవిజ్ఞానవేదిక, తెలుగు భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో వీరమ్మ పార్క్ తెలుగు తల్లి విగ్రహం వద్ద ప్రపంచ మాతృ భాషా దినోత్సవాన్ని చేశారు. తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా గోపాల శర్మ మాట్లాడుతూ తెలుగు భాషను ప్రాచీన భాషగా గుర్తించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ మూడు రోజులపాటు వేడుకలను నిర్వహిస్తున్నామని, వివిధ పాఠశాలలో విద్యార్థులకు పోటీలను నిర్వహించి 21న ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వేగంగా విశిష్ట సంఖ్య నమోదు ప్రక్రియ

సంక్షేమ పథకాల అమలుకు కీలకం అంటున్న అధికారులు

కాళ్ల: రైతులకు ఆధార్ తరహాలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు భూమి ఉన్న ప్రతి రైతుకు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య పత్రం(కార్డు) జారీ చేసే ప్రక్రియను వ్యవసాయాధికారులు చేపట్టారు. భవిష్యత్‌లో వివిధ సంక్షేమ పథకాల అమలుకు ఈ విశిష్ట సంఖ్య ప్రామాణికం కానుంది. ప్రస్తుతం ఉండి నియోజకవర్గంలో కాళ్ల, ఆకివీడు, ఉండి, పాలకోడేరు మండల గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లో ఫార్మర్ యూనిక్ ఐడీ నమోదు ప్రక్రియను వ్యవసాయ సిబ్బంది నిర్వహిస్తున్నారు.

అవసరమైన ధ్రువపత్రాలు

రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, వన్ బి, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రం వద్దకు వెళితే అక్కడ ఉన్న సిబ్బంది ప్రభుత్వం ప్రవేశపెట్టిన వెబ్ సైట్లో వివరాలు నమోదు చేయడంతో పాటు రైతు ఆధార్ కార్డుకు అనుసంధానం అయిన ఫోన్ నంబరుకు మూడు సార్లు ఓటీపీలు పంపిస్తారు. ఆ ఓటీపీలను వ్యవసాయ సిబ్బంది వెంటనే ఆన్‌లైన్ లో నమోదు చేయగానే రైతుకు విశిష్ట గుర్తింపు పూర్తి అయ్యి ఫోన్ నెంబర్ కు 14 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఎస్ఎంఎస్ ద్వారా వస్తుంది దీంతో ప్రక్రియ పూర్తవుతుంది.



రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యకు నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రయోజనాలివే

ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి ఈ 14 అంకెల సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుంది. పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, వ్యవసాయ యంత్ర పరికరాలు, సూక్ష్మ పోషకాలు, సూక్ష్మ సేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం తదితర ప్రభుత్వ పథకాలను రైతు నేరుగా పొందే పరిహారం పొందేందుకు ఉపయోగపడుతుంది. నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి ఇతర సేవలు అందుకోవడానికి ఉపయోగపడుతుంది. వరి, జొన్న, మొక్కజొన్న, పసుపు, అరటి, మినుము తో పాటు కూరగాయలు ఇతరత్రా ఎలాంటి పంటలను సాగు చేసినా ఒక్క సెంటు వ్యవసాయ భూమి ఉన్న వారైనా ప్రతి రైతుకు ఐడీ నంబరు అవసరం. నియోజకవర్గంలో కాళ్ల మండలంలో4100 విస్తీర్ణంలో సాగు రైతులు 1723, ఉండి మండలంలో 10749 విస్తీర్ణంలో సాగు రైతులు 4470 రైతులు, పాలకోడేరు మండలంలో 11500 విస్తీర్ణంలో సాగు రైతులు 5023, ఆకివీడు మండలంలో 4200 విస్తీర్ణం లో1427 మంది ఉన్నారు.

ప్రతి ఒక్కరూ నమోదు చేయించుకోవాలి



విశిష్ట సంఖ్యకు సంబంధించి వ్యవసాయ భూమి ఉన్న ప్రతి రైతూ రైతు సేవా కేంద్రాల వద్దకు సరైన ధ్రువపత్రాలు తీసుకుని వచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని 14 అంకెల ఐడీ పొందాల్సి ఉంటుంది. భవిష్యత్‌లో రైతులకు ఎటువంటి ప్రభుత్వ పథకాలు అందాలన్నా.. ఇది తప్పనిసరి. రైతులెవరూ నిర్లక్ష్యం చేయొద్దు. ఈ నెల 25 లోపు వివరాలు నమోదు చేయించుకోవాలి.

– జయ వాసుకి, వ్యవసాయ అధికారి, కాళ్ల